# మానవుడు సత్సంకల్పములను పోషించుకోవటానికి ప్రయత్నించాలి!

**మనసను ఆయుధంబు ఒక్క మానవునకే యిచ్చె తొల్లి యీ**
**మనసును శిక్షతో నిలుపు మానవుడే విజయుండు భూమిపై**
**మనసుకు దాసుడై మనుజమాత్రు డెవండును శాంతిసౌఖ్యముల్**
**కనుగొన జూచినట్లు వినిపింపగ గల్గడు స్వప్నమందునన్**

ప్రేమస్వరూపులారా!

ఇంద్రియములతోకూడిన యీ పాంచభౌతిక శరీరము మనసుకంటే వేరు కాదు. మనసు తనయొక్క విలాసార్థమై యేర్పరచుకొన్న భవనమే యీ శరీరము. ఈ శరీరము, మనసుకు కవచమువంటిది. ప్రతిదేహమునకు యీ మనసే ఆధారము. యీ మనసే కారణము. నీరు లేని పంటయొక్క అస్తిత్వము యే విధముగా మిధ్యాస్వరూపమైయుండునో అటులనే మనసులేని మానవత్వమునయొక్క స్థితి మిధ్యారూపమై ఉంటుంది. మనసే లోక వ్యాపారములకు, కార్యకలాపములకు, విలాపములకును మూలాధారము. ఉపాధ్యాయుడులేని బడి, దేవుడులేని గుడి, కరెంటులేని వైరు, నీరులేని పైరు ఏ విధముగా నిరర్థకమో మనసులేని మానవుడుకూడను మరణించిన జీవితో సమానము. యిట్టి మనసుతో కూడినట్టి మానవత్వమును దివ్యత్వముగా మార్చుకొనవలెనన్న మానవుని ప్రయత్నముకూడను అత్యవసరము.

## సత్సంకల్పములే మానవునికి గొప్ప ఆస్తి

సర్వసామాన్యముగా మానవుడు తాను శరీరమునందు బంధింపబడిన జీవునిగా భావిస్తుంటాడు. కనుకనే యీ పాంచభౌతికమైన శరీరముయొక్క క్షేమమునకై తన



srisathyasaivachanamrutam

కాలమును, కర్మనుకూడను వుపయోగపరచుకుంటున్నాడు. దేహమే సత్యము, నిత్యమని విశ్వసించి దాని నిమిత్తమై అనేక విధములైన ప్రయత్నములు సల్పుతున్నాడు. ఇట్టివాడు కేవలము అన్నమయ దేహమునే ఆశ్రయించి తన జీవితమును నిరర్థకము చేసుకొనుచున్నాడు. అట్లుకాక, బుద్ధి అను విజ్ఞానమయమును ఆశ్రయించి ఆ విజ్ఞానమయముచేత మనోమయమును జయించినవాడు విజ్ఞుడు కాగలడు. అతనే ప్రజ్ఞావంతుడు. ఈ ప్రజ్ఞాన తత్త్వమనేది సత్సంకల్పములచేతనే యేర్పడుతుంది. సత్సంకల్పములే మానవునికి ప్రధానమైన ఆస్తి. సత్సంకల్పములు సామాన్యమైనవి కాదు. అవి చాలా బలమైనవి, పవిత్రమైనవి, దివ్యమైనవి, భవ్యమైనవి, నవ్యమైనవి. వీటిని మనము యేవిధముగా వుపయోగించుకుందుమో అట్టి ఫలితమును మనకు అందిస్తాయి. ఇలాంటి సత్సంకల్పములు సమయమును పురస్కరించుకొని సత్సంగముచేత అభివృద్ధి పొందుతూ వుంటాయి.

మనసనగా కేవలము తెల్లని కాగితము వంటిది మాత్రమే కాదు. అనేక జన్మలయొక్క సంస్కారములనే కర్మలయొక్క ముద్రలనుకూడి వుంటుంటాది, యీ మనసు. ఇది ఆత్మయొక్క ప్రతిబింబముగా నిరూపిస్తూ వుంటుంది. మనకు యీ లోకములో చాలా గొప్ప ఆస్తి యేమనగా యీ ఆత్మతత్త్వమే! The richest wealth is *Atma* అన్నారు. ఇట్టి ఆత్మతత్త్వాన్ని మనము గుర్తించటము చాలా కష్టము. ఆత్మ+మనసు= మానవ అన్నారు. మనిషి-మైండ్= ఆత్మ అన్నారు. కనుక మనసే రెండింటికిని మూలకారణము. ఈ రెండింటికి మాత్రమే కాదు, సృష్టికే మూలకారణము మనసు. సర్వస్వమునకు మూలకారణము మనస్సే! కనుకనే 'మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' అన్నారు. స్థితిగతులకు యే మాత్రముకూడను యిది లొంగదు. ఎట్టి పరిస్థితులందైనకూడను మానవునియందు సత్సంకల్పమే వుండిన అతనియొక్క జీవితము దివ్యమైన జీవితముగా వుంటుంటాది. కనుక, ప్రతి మానవుడుకూడను సత్సంకల్పములనేదానిని విచారించి, దానియొక్క విషయమును గుర్తించుకొని వర్తించటము అత్యవసరము.

srisathyasaivachanamrutam

## సత్సంకల్పములకు సత్సంగము అవసరము

ప్రతి మానవుడు సత్ సంకల్పముయొక్క శాసనమును, దానియొక్క పనులను తూచా తప్పక విశాలమైన భావముతో ఆచరించవలసివస్తుంది. ఇట్టి సత్సంకల్పమునకు సత్సంగము అవసరము. ఈ సత్సంగము పూర్వము వుండిన దుస్సంకల్పములను దూరముచేసి సత్సంకల్పములను ప్రోత్సహింపచేస్తుంది. ఈ విషయము అనేక గ్రంథములందు అనేక ఉపమానములతోకూడ బోధింపబడింది. రత్నాకరుడు ఒక దోపిడీదొంగ మరియు హంతకుడు. బాటసారులను అనేక విధములుగా హింసించి, వారివద్దనుండి అపహరించిన ధనమును తన కుటుంబపోషణకై వినియోగించుకొనేవాడు. అట్టి రత్నాకరుడు సప్తఋషులయొక్క సంపర్కముచేత తన దుర్భావములను, దుశ్చింతలను దూరము చేసుకొని తద్వారా ఆదికవియైన వాల్మీకిగా మారాడు. సప్తఋషులుకూడను వాల్మీకిని శ్లోకదాతయని, లోకదాత భగవంతుడని శ్లాఘించారు.

ఇంక బుద్ధుని కాలమునందుకూడను అంగుళీమాలుడు అనే దొంగ మహాదుర్మార్గుడు. ఇతనుకూడను యీ రత్నాకరునివలే బాటసారులను హింసించి వారినుండి ధనమును దోచుకుని, యింత మాత్రముతో వదలక వారి అంగుష్టములను కత్తిరించి వాటిని హారముగా ధరించేవాడు. అంతటి మహా క్రూరుడు. అట్టి క్రూరుడైన అంగుళీమాలుడు బుద్ధునియొక్క సంపర్కముచేత గొప్ప సాధకునిగా మారిపోయాడు. జగాయి, మాదాయి అనేవారు మరొక తెగకు సంబంధించినవారు. వారుకూడను యిట్టి క్రూరత్వముచేత జీవించుచువచ్చేవారు. చైతన్యునియొక్క సంపర్కముచేత వారు పరమ భక్తులుగా మారి భజనలయందు, నృత్యమునందే వారికాలమును అంకితము చేసుకుంటూవచ్చారు.

ఈ విధముగా యుగయుగములందుకూడను సత్పురుషులయొక్క సంపర్కముచేత తమయందున్న దుర్భావములను, దురాలోచనలను, దుర్గుణములను దూరము గావించుకొని, సద్భావములను, సత్‌చింతలను, సత్ప్రవర్తనలను అభివృద్ధి పరచుకుంటూ వచ్చారు. యీ సత్సంకల్పములకు మూలకారణము సత్సంగముయొక్క ప్రభావమే. ఈ గాథలన్నీ కేవలము ఎప్పుడో ఏ చరిత్రయందో వ్రాయబడిన కథలుకాదు. సత్సంగములనేవి

srisathyasaivachanamrutam

యేనాటికైననూ మానవుని పూర్ణస్వరూపునిగా తీర్చిదిద్దుతాయి.

**భగవద్భక్తి, సత్సంకల్పములు ఎటువంటి దుస్సాధ్యమునైనా సుసాధ్యము చేస్తాయి**

తమిళ రాజ్యములోపల ఏభైసంవత్సరములకు పూర్వము ఒక బీద బ్రాహ్మణ కుటుంబము వుంటుండేవారు. ఆ సమయములో యీ బీదకుటుంబములో వుండినవారికి ఒక కుమారుడు కలిగాడు. ఆ పిల్లవాడు పెరిగి పెద్దయ్యే సమయములో గాంధీమహాత్మునియొక్క సత్యాగ్రహము మరియు భారతదేశమునయొక్క దాసత్వాన్ని దూరము చేయాలనే ప్రచారము చాలా అధికముగా వుండేది. ఆ రోజుల్లో ఆ ప్రాంతములో బారిష్టరు అనే చదువు గురించి వారికి తెలియక మహాత్మాగాంధీ 'లా' చదివి బారిష్టరై దేశముయొక్క దాసత్వాన్ని దూరము చేయటానికి కంకణము కట్టుకున్న మహాపుణ్యాత్ముడని పల్లెలలో చెప్పుకునేవారు. ఒకనాడు ఈ పిల్లవాని తల్లి కుమారుని దగ్గర వుంచుకొని యేదో కథలు చెబుతున్న సమయములో "నాయనా! నీవుకూడను గాంధీవలే లాయరు చదివి మన బీదవారి బాధలనంతా తప్పించటానికి తగిన ప్రయత్నము చెయ్యాలి. మహా ధర్మాత్ముడవు కావాలి. మహా న్యాయపరుడవు కావాలి". అని బోధించింది. ఆనాటినుండి యీ పిల్లవాడు తల్లియొక్క మాటలను తన హృదయమునందు చేర్చుకొని 'నేను యేనాటికైననూ లాయరు కావాలి. బీదవారి సమస్యలు తీర్చాలి, వారికి సేవలు చెయ్యాల'నే సత్సంకల్పాన్ని అభివృద్ధిపరచుకుంటూ వచ్చాడు. అనేక కష్టములు పడి యేదో ఒక విధముగా బి.ఎల్.లో చేరాడు. అతని యింటియందు విద్యుద్దీపములు లేవు. వీధి దీపములక్రింద కూర్చుని అనేక రకములుగా శ్రమపడి చదువుతూ పరీక్షలు వ్రాస్తూవచ్చాడు. తన జీవితములో అనేక దినములు పస్తు వుండేవాడు, పాపం! అతని స్థితిగతులు చూస్తే చాలా దీనముగా వుండేవి. ఒక రోజున రేపటి దినము పరీక్ష అనగా వీధి దీపముముందు కూర్చొని చదువుకుంటూ వున్నాడు. కాని, నిద్రవచ్చింది. నిద్ర వచ్చిందని ఒక టీ, కాఫీనైనా త్రాగుదామంటే తన చేతిలో కాసులేదు. ఈనాటివలే కాఫీకప్పు ఒక రూపాయి, రెండు రూపాయలుకాదు, ఆనాడు ఒక పైసా! ఆ పైసాకూడను అతని దగ్గరలేదు. కుళాయి దగ్గరకు పోయాడు. కొన్ని నీళ్లు త్రాగాడు. ముఖము తుడుచుకున్నాడు. తిరిగి వీధి దీపమువద్దకు వచ్చి కూర్చున్నాడు.

srisathyasaivachanamrutam

ఈ విధముగా శ్రమపడి పరీక్షలలోపల చక్కగా వుత్తీర్ణుడయ్యాడు. అయితే, అతని సత్సంకల్పము మాత్రము ఏ క్షణము యేమాత్రము మరువకుండ జ్ఞప్తికి తెస్తుండాది. ఏదో చిన్న చిన్న లాయర్లతో చేరి తానుకూడను కోర్టుకు పోవటము, వారితో నేర్చుకోవలసిన విషయములనంతా నేర్చుకోటము, యీ విధముగా కొంతకాలము గడుపుతూ వచ్చాడు. యితనికి భగవంతునిపై చాలా విశ్వాసము. 'నాకు కష్టములుకాని, సుఖములుగాని, యేమి వచ్చినప్పటికిని భగవంతుడు నా మంచికోసమే యిస్తాడు', అనే భావము అతనిలో దీర్ఘముగా వుండేది. మిత్రులెవరైనా యితని పరిస్థితి చూచి 'అయ్యో ఏమి నీకీ దుర్గతి? భగవంతునికి దయలేదా?' అని అడిగినప్పుడు 'God does everything for our good' అని జవాబు చెప్పేవాడు. ఇంత విశ్వాసముతోపాటు ఆసత్సంకల్పముచేత అతనియొక్క జీవితములో ఒక గొప్ప మార్పు వచ్చింది. భారతదేశమునకు స్వతంత్రము వచ్చిన తక్షణమే మద్రాసు హైకోర్టునకు యితనిని ప్రధాన న్యాయాధిపతిగా నియమించారు. ఇతనియొక్క ప్రవర్తన, మరియు నీతి నిజాయితీలకు సరైన గుర్తింపు వచ్చింది, ప్రభుత్వము దగ్గర. అతనే ముత్తుస్వామి అయ్యర్. ఈ ముత్తుస్వామియొక్క స్థితిగతులు మొదట యే విధముగా వుండేవి? అటువంటి వ్యక్తి సత్సంకల్పములయొక్క ప్రభావముచేత, దైవ విశ్వాసముచేత తలవని తలంపుగా హైకోర్టు ప్రధాన న్యాయాధిపతిగా నియమింపబడటమనేది కలలోని వార్తగా భావింపబడేది ఆ రోజుల్లో. ఈ విధముగా భక్తి, దానికి తోడు సత్సంకల్పము వుండినప్పుడు యెంతటి దుస్సాధ్యమైన కార్యమునైనా సాధించటానికి తగిన అర్హులవుతారు.

ఇదే విధముగా విదేశములందుకూడను బజారులలో బూట్సు పాలిష్ చేస్తూ, న్యూస్ పేపర్లు అమ్ముకుంటూ బ్రతికే వ్యక్తులు సత్సంకల్పములు అభివృద్ధి గావించుకోటంచేత గొప్ప writers గా మారుతూ వచ్చారు. గొప్ప విద్యావంతులుగా మారారు. సత్ప్రవర్తన చేతను, సత్కార్యములచేతను తమ జీవితాలను సార్థకము గావించుకొన్నారు. ఇంగ్లాండులోపల కవర్లపైన ఎడ్రసులు వ్రాసి జీవిస్తూవచ్చేవాడు ఒక వ్యక్తి. తద్వారా వచ్చే కొద్దిపాటి షిల్లింగులతోనే తన కడుపును నింపుకుంటూ, ఒక్కొక్క రోజు పస్తుపడుకుంటూ యీ విధముగా కాలము గడపుతూ వచ్చాడు. అలా కవర్లు వ్రాసి యిచ్చే సమయములో 'దైవము

srisathyasaivachanamrutam

నిన్ను ఆశీర్వదించుగాక!' అని చెప్పేవాడు. తన దగ్గరకు వచ్చేవారిని యింటికి పంపించే సమయములో యీ విధముగనే ఆశీర్వదించి పంపించేవాడు. God bless you అనే వాడు. తన సంకల్పబలంచేత, దైవానుగ్రహంచేత, జీవితము ఈ విధముగానే వుండిపోదు, ముందుముందు భగవంతుడు తనకు ఉన్నతమైన, వుత్తమమైన స్థానముకల్పించి తనచేత సేవలు చేయించగలడు అనే గాఢమైన విశ్వాసముకూడను వుండేది అతనికి. తాను ట్యూషన్ చెప్పే పిల్లలకంతాకూడను Trust in God అని మొట్టమొదట చెప్పేవాడు. ఇంతటి గాఢమైన విశ్వాసము కలిగిన వ్యక్తి. అలాంటివాడు చివరకు తాను సంకల్పించినట్టుగానే ఒకానొక దినము British Prime Minister అయ్యాడు. అతనే James Mcdonald. ఈ Mcdonald మొదట్లోకవర్లపైన ఎడ్రసులు రాస్తూవుండేవాడు. ప్రైమినిష్టరు కావటానికి ఎటువంటి ప్రాప్తివుండాలి! ఎటువంటి దైవానుగ్రహము వుండాలి! ఎలాంటి సత్సంకల్పము వుండాలి! కనుక, దైవవిశ్వాసము, మనిషియొక్క సత్సంకల్పము రెండు చేరినప్పుడు నెగిటివ్ పోజిటివ్‌గా వుంటుండి తద్వారా ఎంతైనా ఫలితాన్ని మనము పొందవచ్చు.

**ఈనాడు మానవుడు తన మేధాశక్తిని దుర్వినియోగము చేస్తున్నాడు**

మానవునియొక్క స్థితిగతులను మనము యేమాత్రము విచారించటములేదు. దేహనిర్మాణమునందు మాత్రమే కాకుండా మేధాశక్తియందుకూడను పుడమియందుగల జీవరాసులన్నింటికంటేకూడ మానవుడు చాలా శ్రేష్టమైనవాడు. తాను సంకల్పిస్తే తనకు చేతకానిది యేమాత్రముకూడను లేదు. వుండదు. సంకల్పమాత్రముచేత విశ్వాన్నే తన వశము గావించుకోగలడు. కాని, ప్రాకృతికముగా మానవుడు చాలా దుర్బలుడు. అతనియొక్క జీవితము ఒక అవధిలో వుండేటువంటిది, పరిమితిలో వుండినదనే విషయము మరువకూడదు. ఈ పరిమితమైన జీవితమందే తనయొక్క పవిత్రమైన మేధాశక్తిని వుపయోగపెట్టి ఇతరులకు ఆదర్శవంతుడుగా మారాలి. ఈనాడు మేధాశక్తిని మనము దుర్వినియోగపరుస్తున్నాము. సక్రమమైన మార్గములో ప్రవేశపెట్టటంలేదు. ఏదో తనకు తెలివితేటలుకలవని అపమార్గములో వాటిని ప్రవేశపెడుతున్నాడు. దీనికి కారణము, అతనియందు సత్సంకల్పములు లేకపోవటమే! ఈ సత్సంకల్పములయొక్క ప్రభావము

srisathyasaivachanamrutam

చాలా వున్నతమైనది. కేవలము స్వార్థము, స్వప్రయోజన నిమిత్తమై యీ మేధాశక్తిని వుపయోగపెడుతున్నాడు, మానవుడు. కనుకనే, తనకు మేధాశక్తి వుండినప్పటికిని దానికి తగిన ప్రయోజనమును, పవిత్రతను మానవుడు అందించలేకపోతున్నాడు. స్వార్థము, స్వప్రయోజనము మితిమీరిపోవుటచేత తనయొక్క చేష్టలన్నియుకూడను అపమార్గములను అనుసరిస్తున్నాయి. ఈనాటి మానవుని ప్రతి అడుగు ధర్మము తప్పుచున్నది. ప్రతీ ఆచరణ క్రియా శూన్యమైపోతున్నది. ప్రతి ఆలోచనలోను దూరదృష్టి నశించిపోతున్నది. ప్రతీ ఆశ దురాశగా మారుతుండాది. తన చూపులు ప్రేమరహితము అవుతున్నాయి. తనయొక్క వాక్కు సత్యమునకు దూరమవుతున్నాది. నైతిక విలువలు దినదినమునకు దిగజారిపోతున్నాయి. కులమతద్వేషములు, ప్రాంతీయ దురభిమానములు, బంధుప్రీతి పెచ్చుపెరిగి మారణాస్త్రములుగా తయారవుతున్నాయి. మానవునియందు వుండిన చైతన్యము చల్లబడుతూ వుండాది. డంబము, ద్వేషము, అసూయ అవధులు తప్పి స్వేచ్ఛావిహారము సలుపుతున్నాయి. పాపభీతికి బదులు పాపప్రీతి పెరిగిపోతుండాది. ఆధ్యాత్మికమన్న హాస్యాస్పదముగా చూస్తున్నారు. దీనికి కారణమేమిటి? మానవుడు కేవలము లౌకికమును, భౌతికమునే ఆశించి, వాటినే విశ్వసించి, నీతి నిజాయతీలను కోల్పోటమే! మనసుయొక్క దివ్యమైన ఆత్మశక్తిని గుర్తించుకోలేకపోవటము దుస్సంకల్పములయొక్క ప్రభావమే, దురాశలయొక్క చేష్టలే! మానవుడు మానవునే చంపుకునే పరిస్థితికి యీనాడు ప్రపంచము దిగజారిపోయింది. మానవునికి, మానవునికి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమని మండే పరిస్థితిలో వుంటుండాది. ఈ ద్వేషములకు మూలకారణమేమిటి? సంకల్పములు సరైనవి కాకపోవటమే.

**కోరికలు ఎంత తగ్గితే ఇచ్ఛాశక్తి అంత పెరుగుతుంది**

మానవుడు సత్సంకల్పములను పోషించుకోటానికి ప్రయత్నించాలి. ప్రభావశీలమైన ప్రాణశక్తితో యిచ్ఛాశక్తి కూడినప్పుడే యీ సంకల్పములయొక్క ప్రభావము సరైన స్థితిలో రూపొందుతుంది. నిర్ణయశక్తి, మేధాశక్తి, విచక్షణాశక్తి, గ్రహణశక్తి, వాక్‌శక్తి, ఆలోచనాశక్తి, వూహాశక్తి అనే యీ సప్త శక్తులుకూడను యిచ్ఛాశక్తిలో లీనమై వుంటున్నాయి. ఈ

srisathyasaivachanamrutam

యిచ్ఛాశక్తి అన్ని శక్తులలోపల రాజువంటిది. ఈ యిచ్ఛాశక్తి పెరగవలెనన్న మనము యేమి చెయ్యాలి? కోరికలు తగ్గించుకోవాలి. ఒక చిన్న ఉదాహరణము. ఒక వ్యక్తికి 'నేను సిగరెట్టు తాగాలి', అని కోరికపుడుతుంది. లేక, ఒక కాఫీ తాగాలి, మద్యపానము చేయాలి, అని. ఇలాంటి ఆశలు వుండినప్పుడు వాటిని అదుపులో పెట్టుకున్నప్పుడు, వాటిపైన ప్రసరించుచున్న శక్తి యిచ్ఛాశక్తిలో లీనమైపోతుంది. ప్రతిమానవునికి ఒక యిరవై, ముప్పై కోరికలున్నాయనుకోండి. ఈ కోరికలు ఎంత తగ్గించుకుంటే, ఆ కోరికలపైన ప్రసరిస్తున్న శక్తి యిచ్ఛాశక్తిలో లీనమై యిచ్ఛాశక్తిని అంతకంతకు బలపరుస్తుంది. తాను సంకల్పించుకున్న దానియందు విజయము పొందవచ్చు. సర్వ విజయములకుకూడను యీ యిచ్ఛాశక్తియే కారణము. యిట్టి రహస్యమును గుర్తించుకున్న ప్రాచీన ఋషులందరుకూడను వైరాగ్యమనే పేరుతో సర్వ ఆశలను, సర్వ కోరికలను అదుపులో పెడుతూ వచ్చారు. కోరికలు యెంత తగ్గితే యిచ్ఛాశక్తి అంత పెరుగుతుంది. కనుక, మన వాంఛలను క్రమక్రమేణా తగ్గించుకోటానికి ప్రయత్నించాలి.

**ఇచ్ఛాశక్తితోబాటు క్రియాశక్తిని, జ్ఞానశక్తినికూడా పోషించుకోవాలి**

ఈ ఇచ్ఛాశక్తిని మనము దైవమువైపుకు మరల్చాలి. ఇచ్ఛాశక్తి వుండికూడను, దానిని దైవమువైపు మరల్చుకున్న అది నిరుపయోగమవుతుంది. ప్రతి వ్యక్తికూడను ఒక Instrument ఒక పనిముట్టుగా మనము అనుకుంటున్నాము. అయితే యీ పనిముట్టుకూడను ఆ పనికి తగినటువంటిదిగా వుండాలి. దానిని వుపయోగపెట్టే వ్యక్తి మంచి బలశాలి అయినప్పటికి ఆ గడ్డపారయందు సూటిదనమే లేకపోతే యీ బలముకూడను నిరుపయోగమవుతుంది. ఆ పనిముట్టుకూడను బలమైనదిగను, చాలా సూటియైనదిగను వుంటుండాలి. అప్పుడే దానిని ఉపయోగించే వ్యక్తియొక్క బలముకూడను సద్వినియోగమవుతుంది. మానవునియందు యెంత బలము వుండినప్పటికి ఆ పనిముట్టు వుండవలసిన రీతిగా వుండకుండాపోయిన యేమాత్రముకూడను పని జరపలేదు. అదే విధముగా యిచ్ఛాశక్తి బలవత్తరమైనది అయినప్పటికిని తనయొక్క భావములు భగవద్భావములుగా మారకుండిన యీ యిచ్ఛాశక్తి నిరుపయోగమవుతుంది. కనుక,

మనము యిచ్ఛాశక్తితోపాటు క్రియాశక్తిని, క్రియాశక్తితోపాటు జ్ఞానశక్తిని పోషించుకోవాలి. ఈ విధమైన రీతిగా సత్సంకల్పములు మనము అభివృద్ధి పరచుకున్నప్పుడు మనము సాధించలేనిది యేమాత్రము యీ లోకములో వుండదు. సర్వమును సాధించవచ్చు. కనుక, మనయందు వున్న యిచ్ఛాశక్తిని సత్సంకల్పములుగా మార్చుకోవాలి. సంకల్పములయొక్క ప్రభావము శాశ్వతముగా ఉంటుంది. మనిషి చచ్చినప్పటికి సంకల్పములు చచ్చేవికావు. ఇవి, అమరత్వమైనవి. అమృతత్వమైనవి. కనుక సంకల్పములు సరైన సంకల్పములుగా మనము పోషించుకోవాలి. ఈ సంకల్పములచేతనే మానవత్వమును పవిత్రము గావించుకోవాలి.

**కనిపించని దైవశక్తి కనిపించే జగత్తును నడిపిస్తున్నది**

మనిషి అనగా మనసే! మనస్సనగా సంకల్పములయొక్క చేరికనే! సంకల్పములనగా నిత్యము మనము అనుభవించే పరిణామమే! కనుక, జీవితమంతయు సంకల్పములచేత నిండి వుంటుంది. ఈ సంకల్పములు సక్రమమైనవి కాక ఎన్ని విధములైన సాధనలు చేసినప్పటికి నిరుపయోగములే! అన్నింటికిని భగవద్విశ్వాసము అత్యవసరము. భగవద్విశ్వాసము లేక ఎన్ని గ్రంథములు చదివినప్పటికి, ఉపనిషత్తులయొక్క భావాన్ని అర్థము చేసుకున్నప్పటికి, గీతా సారమును గ్రోలినప్పటికి, బ్రహ్మసూత్రములు పఠించినప్పటికి, జపధ్యానములు సల్పినప్పటికి ఏమి ప్రయోజనములేదు. యివి కేవలము దేహముతో ఆచరించే డ్రిల్లు వంటివి. ఇవంతాకూడను కేవలము exercise వంటివి. ఈ physical exercise వల్ల దేహభ్రాంతి మరింత అధికమవవచ్చు. కనుక, దేహముతోబాటు మనయందున్న భావములుకూడను పరిశుద్ధము గావించుకోవాలి. ఇది కేవలము ఒక్క భగవద్విశ్వాసముతో తప్ప మరొక దానితో సాధ్యపడదు.

**నమ్మకమను రెండు నయనంబులే లేని**
**అంధులైరి మనుజులవనియందు**
**తాముచూడకున్న దైవంబు లేడొకో**
**తనకు లేదుగాని మనకు లేద?**

srisathyasaivachanamrutam

కనుక మన విశ్వాసము మనము అభివృద్ధి పరచుకోవాలి. దైవమే లేకుండిన యీ ప్రకృతియొక్క చిత్రవిచిత్రములంతా ఎవరు చేయగలుగుతున్నారు? ఆకాశమందు లక్షలాది నక్షత్రములంతా వుండినప్పటికి అవి నేలరాలకుండా వుంటున్నాయి. లోకాల చీకట్లన్నీకూడను హతమార్చే నిమిత్తమై సూర్య చంద్రాదులను దీపములుగా పెట్టుకొని భగవంతుడు త్రిప్పుచున్నాడు. ఇరుసు లేకుండానే యీ పృథ్వి అనే చక్రము తిరుగుతూ వుండాది. ఏ జీత భత్యములు లేకుండా ప్రజలకంతా చక్కని గాలి వీస్తున్నాది. అనంతమైన ఆకాశము నేలరాకుండా ఆపివుంటుండేది ఎవరివల్ల? ఈ సృష్టియొక్క చిత్రవిచిత్రములంతాకూడను ఎవరు చేయకలుగుతున్నారు? మానవాతీతమైన, దివ్యమైన అనుభూతులు ఎవరు అందిస్తున్నారు? భగవంతుడు తెరచాటున తానుండి తెరముందు ప్రజలనుంచి తానే ఆడిస్తున్నాడు. కనిపించనిదే కనిపిస్తున్న జగత్తును నడిపిస్తున్నాది. అదే దివ్యశక్తి, అదే దైవశక్తి, అదే సత్యశక్తి, అదే ధర్మశక్తి, అదే 'ధర్మోరక్షతి రక్షితః'. ఆ ధర్మాన్ని రక్షించే నిమిత్తమై మనము సత్సంకల్పములను పోషించుకోవాలి. ఈ సత్సంకల్పములే మనయందు లేకుండిన 'ధర్మయేవ హతోహంతి'. ధర్మమును మనము హతము చేయడానికి ప్రయత్నిస్తాము; కాని, ధర్మమే మనలను హతము చేస్తుంది.

**జీవునకు, దేవునకు భేదములేదని నిరూపించి బోధించే కారణ గురువే నిజమైన గురువు**

ఈనాడు పవిత్రమైన గురుపూర్ణిమ. ఈ గురుపూర్ణిమ విషయము గోకాక్ చక్కగా అర్థమయ్యే రీతిలో మీకు చెప్పాడు. ఏవో కొన్ని గ్రంథములను పఠించటంవల్లను, ఉపదేశములవల్లను తమయందున్న అజ్ఞానమనే అంధకారము దూరము చేసుకొని ప్రజ్ఞానమనే ప్రకాశవంతమైన జ్యోతిని వెలిగించుకోటము గురుపూర్ణిమయొక్క అంతరార్థమని చాలామంది విశ్వాసము. ఏదో ఒక గురువును ఆధారముగా తీసుకోని, అతని సుబోధలచేత తాము వున్నతస్థాయికి చేరుతామనే విశ్వాసము, భారతీయులది. ఇక్కడ గురువులు అనేకమంది వుంటున్నారు. నిజానికి, శాస్త్ర సమ్మతమైన గురువులు ఎనిమిది మంది-బోధగురువు, వేదగురువు, నిహితగురువు, కామ్యగురువు, వాచకగురువు, సూచకగురువు, కారణగురువు, విహితగురువు. బోధగురువు కేవలము శాస్త్రార్థమును



srisathyasaivachanamrutam

మాత్రమే బోధించి దానియొక్క నిబంధనలు తగిన రీతిగా ఆచరించటానికి వుత్సాహప్రోత్సాహముల నందించేవాడు. వేదగురువనగా తత్త్వార్థాన్ని బోధించి, తత్త్వ దర్శనములను గావించి, మనస్సును దైవమువైపు మరలించేవాడు. నిహిత గురువు అనేక విధములైన సందేహములను రూపుమాపి మనస్సును పరిశుద్ధము గావించి చిత్తశుద్ధిచే ఆత్మతత్త్వాన్ని గుర్తింపజేసేవాడు. నిషిద్ధ గురువు కొన్ని కామ్య కర్మలను బోధించి యిహ, పరములందు మోదము నందించేవాడు. కామ్యగురువు పుణ్యకార్యములను ఆచరింపజేసి తద్వారా యిహపరములనందు సుఖము నందించేవాడు. సూచక గురువు శమదమాది సత్సంపత్తిని బోధించి మానవునియొక్క యింద్రియాలు నిగ్రహింపజేసేవాడు. ఇంక వాచక గురువు. ఇతను యోగతత్త్వమును బోధించి దివ్యమైన ఆత్మతత్త్వమును అనుభవింపజేసేవాడు. కారణ గురువు జీవబ్రహ్మైక్యానుసంధానము కలిగింపజేసేవాడు. కనుక, కారణ గురువే ప్రధానమైన గురువు. జీవ తత్త్వాన్ని దైవత్వముగా మార్చగలిగేవాడు. ఈ రెండింటియొక్క సంబంధము బింబ, ప్రతిబింబములయొక్క సంబంధమని బోధించేవాడు. జీవునకు, దేవునకు భేదములేదని నిరూపించేవాడు. ఆచరణరూపమైన ప్రబోధలు సలిపేవాడు, ప్రత్యక్ష ప్రమాణములు నిరూపించేవాడు. ఇటువంటి గురువు ఒక్క దైవము మాత్రమే! కనుక, అట్టి గురువునే 'గురుబ్రహ్మ గురువిష్ణుః గురుదేవో మహేశ్వరః తస్మై శ్రీ గురవేనమః' అని ఆరాధిస్తారు. అతనే బ్రహ్మ విష్ణు మహేశ్వరుడుగా భావించుకోవాలని నిరూపిస్తూ వచ్చారు.

**సర్వత్ర వ్యాపించిన చైతన్యశక్తియే విష్ణువు**

కనుక, లోకసంబంధమైన వారందరుకూడను గోకాక్ చెప్పినట్లుగా టీచర్సుమాత్రమేగాని వారిని గురువులని చెప్పటానికి వీలుకాదు. మనము యిలాంటి గురువులను ఆశ్రయించి మనయొక్క స్వస్వరూపాన్ని అనుభవించలేము. అందులోను యీనాడు మరింత విచిత్రమైన గురువులు పుట్టుకొస్తున్నారు: చెవులో మంత్రము చెప్పటం, చేతితో డబ్బు తీసుకోటం. ఈ మంత్ర వ్యాపారములో మునిగిపోయారు, యీనాటి గురువులు. మంత్రములచేతగాని, తంత్రములచేతగాని మనకు దివ్యత్వము ప్రాప్తించదు.

srisathyasaivachanamrutam

మనసునందు కరడుకట్టిన మాలిన్యాన్ని యేనాడు పరిశుద్ధము గావించుకుందుమో అప్పుడే మనకు పవిత్రమైన మంత్రప్రభావము ప్రాప్తిస్తుంది. కనుకనే 'చిత్తస్యశుద్ధయే కర్మః' అన్నారు. చిత్తశుద్ధిని గావించుకొనే నిమిత్తమై మనము కర్మలు ఆచరించవలసినదే! ఈ విధమైన విశ్వాసముతో మనము నిత్యజీవితమును గడపాలి. ఏది చేసినా, ఏది చూచినా, ఏది చెప్పినా, ఏది విన్నాకూడను భగవద్విశ్వాసముతో నిండియుండాలి. 'సర్వం విష్ణుమయం జగత్'. 'సర్వం సంకల్పమయం, విష్ణుమయం'. కనుక, విష్ణువునకు సంకల్పమునకు భేదములేదు. సత్సంకల్పమే విష్ణు స్వరూపము. విష్ణువనగా కేవలం శంఖుచక్రగదాధారి మాత్రమే కాదు. సర్వత్ర వ్యాపించిన చైతన్యశక్తియే విష్ణువు. లౌకికములైన పురాణములచేత మనము లౌకికమైన వాంఛలనే విశ్వసించి, లౌకికమైన భావములనే విశ్వసించి, లౌకికమునందే మునిగిపోతున్నాము. సర్వులయందు దైవత్వము వుంటుండాది. అది లేని దేహమే లేదు. కనుక, సర్వులయందుకూడను దైవము వున్నాడనే విశ్వాసము మనము అభివృద్ధి గావించుకోవాలి. ఎవరిని హింసించినా, ఎవరిని బాధించినా, ఎవరికి నొప్పి కలిగించినా అది దైవానికే కలిగించినట్టుగా మనము విశ్వసించాలి.

**భగవంతుని ఆశ్రయించినప్పుడే మనకు శాంతి లభిస్తుంది**

ఈ జగత్తులో శాంతివున్నదని అనేక విధములుగా మనము భ్రాంతి చెందుతున్నాము. నిజానికి, శాంతి జగత్తులో లేదు. శాంతి మనయందే వుంటున్నది. ఒక చిన్న ఉదాహరణము. మనము ఎక్కడైనా ఒక పట్టణానికి క్యాంపు వేస్తాము. పది దినాల పని నిమిత్తమై ఒక హోటలులో ప్రవేశిస్తాము. మనము మొట్టమొదటనుండి ఏ ఆహారాన్ని భుజిస్తున్నామో ఆ ఆహారము లభించే హోటలును మనము వెతుకుతూ వెళ్తాము. ఒక హోటలు ముందుగా ఏదో ఒక పేరు వుంటున్నాది. 'బ్రాహ్మణ హోటలు' అని వుంటున్నాది. ప్రక్కనే చూస్తే 'మిలట్రీ హోటలు' అని వుంటుండాది. తాను శాకాహారి అయినప్పుడు బ్రాహ్మణ హోటలులోకి ప్రవేశిస్తాడు, యీ పేరును చూసి. మాంసాహారి అయితే మిలట్రీ హోటలులోకి ప్రవేశిస్తాడు. అట్లుకాకుండా పేరును చూడకుండా మిలటరీ హోటలులోకి ప్రవేశించి 'నాకు సాంబారు, రసం తీసుకురండి', అంటే వాడు యిస్తాడా? 'అయ్యా! యిక్కడ

srisathyasai vahanamrutam

సాంబారు, రసం లేవు. ప్రక్క హోటలుకు పొమ్మ'ంటాడు. ఈ పొరపాటునకు కారణమేమిటి? బోర్డు చూడకుండా ప్రవేశించటమే దీనికి కారణము. అదే విధముగనే మనము యీ ప్రపంచములో ప్రవేశించేప్పుడు దీనికి ముందున్న బోర్డును చూడకుండా ప్రవేశించి 'శాంతి, శాంతి, శాంతి' అని అడుగుతున్నాము. అయితే ఆ బోర్డు ఎట్లా వుంది? 'అనిత్యం అసుఖమ్ లోకం' అని బోర్డు వ్రాసిపెట్టి వుంటుండాది. అనిత్యం, అసుఖంతో నిండిన ఈ ప్రపంచములో యింక శాంతి ఎక్కడ వుంటుంది? నిజంగా ఆ బోర్డు చూచి వుంటే యీ ప్రపంచములోకి వచ్చి ఎవరైనా నాకు శాంతి కావాలని కోరతాడా? అయితే యీ శాంతి ఎక్కడ వుంటుంది? తనయందే వుంటుంది. తన యందున్న శాంతిని తాను మరచి జగత్తులో వెతకటానికి ప్రయత్నిస్తే యిది దొరకదు. శాంతికి కర్త, భర్త దైవమే! కనుక, అతనిని ఆశ్రయించినప్పుడే మనకు శాంతి లభిస్తుంది. Peace ఏ విధముగా వస్తుంది? జగత్తులో అంతా pieces నే. There is no peace. హస్తమున అణుబాంబు వుంచుకొని, అరచుచుందురు 'శాంతి, శాంతి', యని. చేతిలో వుండేది అణుబాంబు, అరిచేది శాంతి శాంతి యని. ఎక్కడ వస్తుంది, శాంతి? ఎప్పుడు యీ అణుబాంబును దూరం చేస్తామో అప్పుడే మనకు శాంతి లభిస్తుంది. కనుక, జగద్భావము అనేదాన్ని మనము దూరము చేసినప్పుడే, దైవభావము మనలో ప్రవేశించినప్పుడే మనకు శాంతి లభిస్తుంది. ఈ విశ్వాసాన్ని మనం యీనాడు పెంచుకోవాలి.

**'దేవుడున్నాడు' అనే పంచాక్షరీ మంత్రమును మీరు ప్రధానంగా తీసుకోండి**

ఈ గురుపూర్ణిమ దినము ఏ అష్టాక్షరనామమో వుపదేశించటానికి నేను పూనుకోలేదు. ఏ పంచాక్షర నామమో మీకు ఉపదేశించటానికి నేను సిద్ధముగా లేను. ఏ ఉపనిషత్తులో, ఏ భగవద్గీతనో, బ్రహ్మసూత్రములో చదవమని నేను బోధించటంలేదు. అయితే పంచాక్షరినామము ఒకటి వున్నాది. 'దేవుడున్నాడు' అని. యీ ఐదు అక్షరాల నామమునే మీరు ప్రధానంగా తీసుకోండి. దేవుడున్నాడు అనే విశ్వాసమును మనము నిరంతరము చింతిస్తూ, భావిస్తూ, ఆచరిస్తూ, ఆనందిస్తూ, అందిస్తూ వుంటే యింతకంటే లోకముయొక్క కళ్యాణము మరొక్కటిలేదు.

srisathyasaivachanamrutam

ఉన్నాడయా దేవుడున్నాడయా
కన్నులకు కన్పించకున్నాడయా
లోకాల చీకట్లు పోకార్ప రవిచంద్ర దీపాలు
గగనాన త్రిప్పుచున్నాడయా ॥ఉన్నాడయా॥
లక్షలాదిగనున్న నక్షత్రములనెల్ల నేలరాల్పక
మింట నిల్పుచున్నాడయా ॥ఉన్నాడయా॥
ఈ ధారుణీ చక్రమిరుసులేకుండ ఎల్ల
వేళల త్రిప్పుచున్నాడయా ॥ఉన్నాడయా॥
జీత బత్తెము లేక ప్రీతితో మనకొరకు గాలితో
సురిడీలు విసిరాడయా ॥ఉన్నాడయా॥
ఆధారమేలేక అలరారు చున్నట్టి
ఆకాశమును ఆపుచున్నాడయా ॥ఉన్నాడయా॥
పొంగిపొరలుచువచ్చి పృధ్విపై పడకుండ
కడలిరాజు కాళ్లు ముడిచాడయా ॥ఉన్నాడయా॥
ఉన్నాడయా దేవుడున్నాడయా కన్నులకు కన్పించకున్నాడయా
కన్పించకేమి చేస్తున్నాడయా
తెరచాటు తానుండి తెరముందు ప్రజనుంచి
తైతక్క లాడించు చున్నాడయా ॥ఉన్నాడయా॥

ఈ మంత్రాన్నే మీరు యీనాటి ఉపదేశముగా భావించి ఎక్కడికి పోయినా, ఎలాంటి పరిస్థితిలో నయినా దేవుడు 'ఉన్నాడు' 'ఉన్నాడు' అని టేబులు కొట్టి చాటాలి. ఈ విశ్వాసాన్ని మీరు బలపరచుకుంటే లోకమంతా నిత్యకళ్యాణము పచ్చతోరణముగా కళకళలాడుతుంది. ఈ విధమైన ప్రచారముచేత పాపభీతి, దైవప్రీతి మనము అభివృద్ధిపరచుకుంటాము. ఎలాంటి సమస్యలు వచ్చినప్పటికిని దానిని ఎదుర్కొనే ధైర్యసాహసములు మనకు లభిస్తాయి. యీ 'ఉన్నాడయా' అనే విశ్వాసమే మనకు బ్రహ్మాస్త్రముగా మారుతుంది. ఏ రామమంత్రముకంటే, ఏ కృష్ణమంత్రముకంటే, ఏ శివమంత్రముకంటేకూడను

sri sathyasai vachanamrutam

'దేవుడున్నాడు' అనే మంత్రమే చాలా బలమైన మంత్రము. ఎన్ని మంత్రములు చెప్పి ఏమీ ప్రయోజనములేదు. మంత్రశక్తి, యంత్రశక్తికంటే చిత్తశుద్ధి ప్రధానమైనది. మన విశ్వాసము హృదయమునుండి ఆవిర్భవించాలి. అక్కడే వున్నాడు దైవము.

**మన అదృష్టము, దురదృష్టము మన సంకల్పములపైననే ఆధారపడి ఉంటున్నాయి**

భగవద్గీతయందు భగవంతుడు దేహములో ఎక్కడ వున్నాడనే సత్యాన్ని చక్కగా నిరూపిస్తూవచ్చాడు. 'అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహ మాశ్రితః'. ఈ దేహాన్ని ఆశ్రయించి నేను వైశ్వానరుడుగా నీ కడుపుయందే వుంటున్నానన్నాడు. నీ కడుపుకు ఎట్టి పదార్థము వేస్తావో ఆ పదార్థమును జీర్ణించి అదే సప్లై చేస్తుంది. కనుక, చెడ్డ భావము కలిగిన పదార్థము నీయొక్క జఠరాగ్నికి అందిస్తే అక్కడనుంచి చెడ్డ ఫలితమే నీ కందిస్తుంది. పవిత్రమైన భావములు కల పదార్థము నీయొక్క జఠరాగ్ని కందిస్తే అక్కడ పవిత్రమైన ఫలితమునే నీకందిస్తుంది. కనుక అదృష్టమునకు, దురదృష్టమునకు సంకల్పములే మూలకారణము. సంకల్పములనే బీజమునుండియే కర్మలనే ఫలములుద్భవిస్తున్నాయి. కర్మలనే బీజమునుండి శీలము అనే ఫలము ఉద్భవిస్తున్నాది. శీలము అనే బీజమునుండి అదృష్టమనే ఫలములు లభిస్తున్నాయి. కనుక, మనయొక్క అదృష్టమునకు శీలమనే బీజము ఆధారము. శీలమనే ఫలమునకు మన అభ్యాసమే ఆధారము. ఈ అభ్యాసమునకు కర్మనే ఆధారము. ఆ కర్మకు మన సంకల్పములే మూలము. కనుక, మన అదృష్టము, దురదృష్టము సంకల్పములపైనే ఆధారపడి వుంటున్నాయి. కనుక, మన సంకల్పములను సరైన రీతిగా అభివృద్ధిపరచుకోవాలి.

సంకల్పముయొక్క శాసనాన్ని చక్కగా గుర్తించటానికి ప్రయత్నించాలి. దాని పనులను మనము విశాలమైన హృదయముతో విచారించాలి. సంకల్పములు వచ్చిన తక్షణమే క్రియారూపము ధరించటము మంచిదికాదు. మంచిదా? చెడ్డదా? ఇది చేయతగినదా, చేయతగనిదా అనే విచారణ సలపాలి. దీనివలన సమాజమునకుగాని, నాకుగాని మంచి జరుగుతుందా లేక హాని జరగుతుందా అనికూడను విచారించాలి. జీవితమంతయుకూడను మన అదృష్ట దురదృష్టములనేవి మన సంకల్పములపైనే ఆధారపడివున్నాయికాని



sri sathyasai vachanamrutam

యితరులు దీనికి కర్తలుకాదు. కారకులుకాదు. ఏదో మన బలహీనతచేత ఫలానా వారివల్ల నాకిట్లా జరిగింది అని భ్రమిస్తుంటాము. మన సుఖములకు, దుఃఖములకు మన సంకల్పములే కారణము. మన బాధలకు, ఆనందములకు మన సంకల్పములే కారణము. కనుక, సత్సంకల్పములను అభివృద్ధిపరచుకున్న మానవుడే యీ జగత్తునందు సర్వేశ్వరత్వమును అనుభవించటానికి అర్హుడవుతాడు.

**విశ్వాసమే మన శ్వాసగా భావించాలి**

యిట్టి దివ్యమైన విశ్వాసాన్ని బలపరచుకొనే నిమిత్తమై నిరంతరము 'దేవుడున్నాడయా, ఉన్నాడయా దేవుడున్నాడయా' అనే పంచాక్షరీ మంత్రాన్ని వుచ్చరించాలి. 'బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి'. బ్రహ్మతత్త్వము యెరిగినవాడు బ్రహ్మగా మారిపోతాడు. కనుక, వున్నాడు వున్నాడు అంటే తాదాత్మ్య భావాన్నిపొంది సాక్షాత్కారాన్ని అందుకుంటాడు. ఈ విశ్వాసమునకు ఎన్ని అంతరాయములు కలిగినప్పటికిని మనము వెనుకంజవేయక ముందంజవేస్తూ పోవాలి. దీనివల్ల నిజమైన ఆత్మశక్తిని మనము సాధిస్తాము. ఆనందాన్ని అనుభవిస్తాము. దేశానికి ఆనందాన్ని అందిస్తాము. అంతేకాని ప్రతిక్షణం దేవుడు వున్నాడో లేదో, వున్నాడో లేదో అనే సంశయాలతో ఉంటే, 'సంశయాత్మ వినశ్యతి' అన్నట్లు అవుతుంది మన పరిస్థితి. సంశయములతో జీవితమును నాశనము చేసుకొనకూడదు. ఈ సంశయమున్నవాడు సర్వ విధముల అధముడై పోతాడు. ఏ ఒక్క విషయమునకైననూ ఒక శక్తిని మనము అనుభవించాలి. ధైర్యసాహసములు పెంపొందించుకోవాలంటే ఒక విధమైన నమ్మకమును పోషించుకోవాలి. నమ్మకము లేకపోతే దేనినీ మనము అనుభవించలేము. నిత్యజీవితములో ప్రతి సందర్భములోను నమ్మకముతోనే మన జీవితాన్ని గడపుతూ వస్తున్నాము. ఈనాడు యేదో ఒక యింటికి పునాది వేసి వచ్చే సంవత్సరము ఓపెనింగ్ చేసుకుంటామని నమ్మకమే లేకపోతే పునాదే వేయలేము. పొద్దున్నే మనము సూటు, బూటు, హేటు అంతా వేసుకొని ఆఫీసుకి వెళ్లిపోయి తిరిగి నేను సాయంకాలము యింటికి వస్తానో లేదో అనుకుంటే ఆఫీసుకే పోలేము. ఒక బ్యాగును తీసుకొని మార్కెటుకి వెళ్లి కూరగాయలు తీసుకొని రావాలనుకుంటే నేను కూరగాయలు

sri sathyasai vachanamrutam

తీసుకొని యింటికి వస్తానో లేదో అప్పటివరకు వుంటానో లేదో అంటే వీడు మార్కెట్‌కే పోలేడు. కనుక, యిట్టి చిన్న విషయములలోపలకూడను మనము యెంతో విశ్వాసముగా వుండటముచేత యిన్ని కార్యములు సాధించగలుగుతున్నాము. విశ్వాసమే మన శ్వాసగా భావించాలి. విశ్వాసము లేకపోతే మన జీవితము శ్వాసలేని జీవితమే అవుతుంది. అన్ని విశ్వాసములకంటేకూడను ఆత్మవిశ్వాసము చాలా ప్రధానమైనది. ఇట్టి ఆత్మవిశ్వాసముచేత మనము ముందంజ వెయ్యాలిగాని ఏ మాత్రముకూడను వెనుకకు తిరుగకూడదు. కనుక, యీనాటినుండి మీరు యీ దైవ విశ్వాసమును అభివృద్ధి పరచుకొని సమాజసేవలలో పాల్గొని తోటి మానవుల బాధలను కొంతవరకు పంచుకొని సమాజసేవకు మీ జీవితమును అంకితముగావించాలని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా దీర్ఘ ప్రసంగాన్ని విరమిస్తున్నాను. ఎవరికి సేవచేసినా దైవానికి సేవ చేస్తున్నానని భావించండి.

**(తేదీ 21-07-1986న పూర్ణచంద్ర సభామంటపములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam